సాక్షి
ఖమ్మం
గురువారం ၊ 12 ၊ అక్టోబర్ ၊ 2023



కేంద్రం నిధులు పక్కదారి

కేంద్రం కేటాయిస్తున్న నిధులను తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని కేంద్ర మంత్రి బీఎల్.వర్మ ఆరోపించారు. 12లో



సంపదను కొల్లగొడుతున్నారు..

ఏజెన్సీ సంపదను ప్రభుత్వం అగ్రవర్ణాల వారి ఖాతాల్లోకి మళ్లిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం వేళ కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

పరీక్షల నిర్వహణపై సన్నాహక సమావేశం




అధికారులతో సమీక్షిస్తున్న ఏఓ అరుణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఈనెల 16నుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ఏఓ అరుణ ఆధ్వర్యాన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రెండు కేంద్రాలు ఏర్పాటుచేయనుండగా పదో తరగతి పరీక్షలు 414మంది, ఇంటర్ పరీక్షలు 448మంది రాయనున్నారని తెలిపారు. ఈమేరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని, పరీక్ష ప్రారంభానికి అర గంట ముందు నుంచే కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్ కింద పంటలు సాగు చేయొద్దు

వైరా: ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో వైరా రిజర్వాయర్‌లో నీరు తక్కువగా ఉన్నందున రైతులు కొత్తగా పంటలు సాగు చేయొద్దని ఐబీ ఈఈ శ్రీనివాస్ సూచించారు. చాలా మంది రైతులు ఆయకట్టు పరిధిలో కొత్తగా పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారని తెలిసిందని.. అలాచేస్తే నీరు అందక నష్టపోవయే అవకాశముందని తెలిపారు. ఆయకట్టు కింద కొత్తగా సాగు చేసే పంటలకు నీరు ఇచ్చే పరిస్థితి లేని విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని ఈఈ ఓ ప్రకటనలో కోరారు.

ఐఎంఏ కార్యవర్గం ఎన్నిక



నారాయణరావు, అధ్యక్షుడు



జగదీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి

ఖమ్మంవైద్యవిభాగం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈమేరకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్ష స్థానానికి పటీ పడిన కంభంపాటి నారాయణరావుకు 193 ఓట్లురాగా, ఇంకో అభ్యర్థి షేక్ బాబుజాన్‌కు 94 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో నారాయణరావు విజేతగా నిలిచారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా కూసుకుర్తి జగదీష్‌బాబు, కోశాధికారిగా స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కప్పల బంధం చేరిన సాగర్ జలాలు



మెయిన్ కెనాల్‌కు చేరిన సాగర్ జలాలు

కల్లూరు రూరల్: ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ఇటీవల నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేశారు. జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు చేరిన నీటిని దిగువకు విడుదల చేస్తుండగా, బుధవారం కల్లూరు మండలం కప్పలబంధం హెడ్ రెగ్యులేటర్ వరకు చేరాయి. ఇక్కడి నుంచి గురువారం ఉదయం మధిర బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల చేయనున్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి జావేద్ పాషా

కొణిజర్ల: బాలికల సంరక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం కొణిజర్ల మండలం బస్వాపురంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాలికల రక్షణకు ఉన్న చట్టాలను వివరించడమే కాక ఉచితంగా అందే న్యాయసాయంపై అవగాహన కల్పించారు. ఆతర్వాత బాలికలకు చట్టాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పాఠశాల ఎస్ఓ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అంతులేని నిరీక్షణ!

కాంగ్రెస్ ఆశావహుల్లో ఎడతెగని ఉత్కంఠ

- రెండు విడతలుగా అభ్యర్థుల ప్రకటన ఉంటుందని ప్రచారం
- కమ్యూనిస్టులతో పొత్తుపై అదే సస్పెన్స్
- కొత్తగూడెం సీటు ఆశిస్తున్న కాంగ్రెస్ నేతల్లో ఆందోళన
- పొంగులేటి, తుమ్మల పోటీ చేసే స్థానాలపైనా ఆసక్తి

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోంది. రేపు, మాపు అని ప్రచారమే తప్ప అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రాకపోవడంతో ఆశావహుల్లోనే కాక పార్టీ శ్రేణుల్లోనూ ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా దసరా ముందు కొన్ని స్థానాలకు, ఆ తర్వాత మిగతా స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతుండడంతో మొదటి జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ఎన్ని స్థానాలు ఉంటాయనే ఆసక్తి మొదలైంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఎటూ తేలకుండానే..

ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల నుంచి పోటీ కోసం 120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, స్క్రీనింగ్ కమిటీ భేటీలు వరుసగా జరుగుతున్నా అభ్యర్థుల ఎంపిక తేలడం లేదు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా వారు ప్రచారంలో దూసుకెళ్తుండడం.. మరోపక్క ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా కాంగ్రెస్‌లో మాత్రం నిరీక్షణ కొనసాగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిర, భద్రాచలం నుంచి సిట్టింగ్‌లైన భట్టివిక్రమార్క, పొదెం వీరయ్య పేర్లు ఖరారు కాగా.. మిగిలిన ఎనిమిది స్థానాలను ఆశిస్తున్న అభ్యర్థులు ఢిల్లీ, హైదరాబాద్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రిజర్వ్‌డ్ స్థానాలైన వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, పినపాక, ఇల్లెందు సహా పలు నియోజకవర్గాల్లో పోటీ ఎక్కువగా ఉండడంతో వడపోతకు సమయం పడుతుందని చెబుతున్నారు.

పొత్తు ఉంటే ఎలా?

కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మధ్య పొత్తుపై జాతీయ స్థాయిలో చర్చలు సాగుతున్నట్లు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రాథమికంగా ఇరు పార్టీలు సుముఖత వ్యక్తం చేసినా, స్థానాల విషయమై ప్రతిష్టంభన నెలకొన్నట్లు సమాచారం. సీపీఐ నేతలు కొత్తగూడెం సీటు కోసం పట్టుపడుతుండగా.. పొత్తుపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారంతో కాంగ్రెస్‌లోని ఆశావహుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ కాంగ్రెస్, సీపీఐ రెండూ బలంగానే ఉండడం... జాతీయస్థాయిలో చర్చల్లో పురోగతి ఉన్నా చివరకు ఫలితం ఎలా ఉంటుందోననే విశ్లేషణ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఈ స్థానం నుంచి సీపీఐ తరఫున పార్టీ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక పాలేరు, భద్రాచలంపై సీపీఎం దృష్టి సారించి జాతీయ స్థాయి నేతల ద్వారా కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిసింది. అయితే, కాంగ్రెస్, కమ్యూనిస్టుల నడుమ పొత్తు చర్చల్లో చివరకు ఏం జరుగుతుంది, స్థానాల కేటాయింపు ఎలా చేస్తారన్నది తేలాల్సి ఉంది.

మనోళ్ల పేర్లు ఎప్పుడు?

కాంగ్రెస్ అభ్యర్థులను రెండు విడతల్లో ప్రకటిస్తారని తెలుస్తోంది. రెండు రోజుల్లో తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ, ఈనెల 14న కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీ కానున్నట్లు సమాచారం. అనంతరం తొలి విడత అభ్యర్థుల జాబితా విడుదలయ్యే అవకాశముందని తెలుస్తోంది. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎందరి పేర్లు తొలి జాబితాలో ఉంటాయో తెలియక ఆశావహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఎలాంటి ఇబ్బంది లేని స్థానాలను తొలిజాబితాలో వెల్లడించే అవకాశముందని.. మిగతావి దసరా తర్వాత ప్రకటిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తద్వారా తొలివిడతలో మధిర, భద్రాచలం ఖాయమని తెలుస్తుండగా... కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థిత్వాలు ఖరారైనా ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

ఇంకా అవకాశం ఉంది!

- ఓటు నమోదుకు 31వరకు గడువు
- తొలగింపులు మాత్రం ఉండవు..



ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎన్నికల సంఘం అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించింది. గతనెల 19వ తేదీ వరకు గడువు ఉండగా, ఈనెల 4వ తేదీన ఓటర్ల తుదిజాబితా విడుదల చేశారు. అయితే, ఇంకా నమోదు చేసుకోని వారెవరైనా ఉంటారనే ఆలోచనతో ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

మేలుకోండి ఇప్పటికైనా..

అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారే కాక ఇప్పటివరకు ఓటు హక్కు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదేళ్ల పాటు ప్రజలను పాలించే వారిని ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమవుతుంది. అలాగే, మంచి నాయకులను ఎన్నుకోవాలంటే అందరికీ ఓటు హక్కు కలిగి ఉండడమే కాక ఓటు వేయడం తప్పనిసరి. అందుకే అర్హులు నిర్లక్ష్యం చేయకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు ఓటు హక్కు లేని వారంతా ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే రానున్న శాసనసన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఇలా తెలుసుకోవచ్చు

ఓటు ఉందా లేదా అనే వివరాలను తెలుసుకునేందుకు వివిధ రకాల వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన వెబ్‌సైట్‌లు www. nvsp. in, voters.eci.gov.inతో పాటు రాష్ట్రానికి సంబంధించి www.ceotelangana.nic.in వెబ్‌సైట్‌లోనే కాక ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు. అంతేకాక కంట్రోల్ రూం 1950 నంబర్‌కు ఫోన్ చేసినా సమాచారం ఇస్తారు. కాగా, ఓటు లేని వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, చిరునామా మార్పునకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. పూర్తిగా పేరు తొలగింపునకు మాత్రం ఇప్పుడు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.

ప్రలోభాలకు చెక్ పెడదాం..

ఫిర్యాదుకు 'సీ–విజిల్' యాప్

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల నేపథ్యాన ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అభ్యర్థులు యత్నించే అవకాశముంది. ఈ నేపథ్యాన వీరికి చెక్ పెట్టేందుకు, ఓటర్లు ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం సీ–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫొటోలు, వీడియోల ఆధారంగా నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వారెవరైనా ప్లే స్టోర్ నుంచి సీ–విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. అనంతరం ఫొటో, వీడియో, ఆడియో మూడు రకాల ఆప్షన్లు వస్తాయి. లైవ్ లొకేషన్ ఆన్ చేసి అక్కడి పరిస్థితుల ఆధారంగా ఆప్షన్ ఎంపిక చేసుకుని ప్రొసీడ్ కొడితే నేరుగా సంబంధిత అధికారులకు విషయం చేరిపోతుంది.

వంద నిమిషాల్లోనే..

ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా మద్యం, డబ్బు, ఇతర సామగ్రి పంపిణీ చేస్తున్నట్లయితే సీ–విజిల్ యాప్ ద్వారా ఫొటో, వీడియో ఆధారంగా ఫిర్యాదు చేయొచ్చు. ఈ వివరాలు అధికారులకు చేరిన 100నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకుని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అంతేకాక బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారనే అంశాన్ని కూడా ఫిర్యాదుదారులకు చేరవేస్తారు. అంతేకాక ఫిర్యాదు చేసిన వారి వివరాలను బయటకు వెల్లడించబోమని అధికార యంత్రాంగం చెబుతోంది. కాగా, సీ విజిల్ యాప్‌ను ఎక్కువ మంది డౌన్‌లోడ్ చేసుకునేలా, ప్రలోభాలపై ఫిర్యాదు చేసేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు.



సీ–విజిల్ యాప్ పనితీరును వివరిస్తున్న కలెక్టర్ గౌతమ్

సెక్టోరియల్ అధికారులే కీలకం

- ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి
- అవగాహన సమావేశంలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమైనందున అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఅధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యాన ప్రచార సంబంధ హోర్డింగ్‌లు, పోస్టర్లు తొలగించకపోతే వెంటనే తీయించాలని చెప్పారు. అలాగే, నిరంతరం తనిఖీలతో మద్యం, నగదు తరలింపునకు అడ్డుకట్ట వేయాలని, ప్రతీ పోలింగ్ స్టేషన్ సందర్శించి సౌకర్యాల కల్పనకు చొరవ తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఓటర్లతో సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని తెలిపారు. అలాగే, ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకులా అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. అనంతరం మాస్టర్ ట్రెయినర్, స్వీప్ నోడల్ అధికారి శ్రీరాం ఎన్నికల ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు స్నపన తిరుమంజనం జరిపించారు. ప్రతీ బుధవారం ఉత్సవ మూర్తులకు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, అంతరాలయంలో దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పూజలు చేశాక బేడా మండపంలో శ్రీసీతారామచంద్రస్వామి వారి ఔన్నత్యం, పాలనాదక్షతను భక్తులకు వివరించారు.

ఆడపిల్లను రక్షించండి.. చదివించండి

బాలికా దినోత్సవ సభలో డీడబ్ల్యూఓ సుమ



బాలికలకు తినిపిస్తున్న డీడబ్ల్యూఓ సుమ

ఖమ్మంఅర్బన్/ఖమ్మం వన్‌టౌన్: సమాజానికి వెలుగుగా నిలిచే ఆడపిల్లలను సంరక్షించడం, చదివించడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సుమ తెలిపారు. ఖమ్మం వెలుగుమట్ల గుట్టపై ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలిక దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. బాలికల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇప్పటికే విద్యా, క్రీడా, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్న మహిళలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఆతర్వాత మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సదనంలో జరిగిన వేడుకల్లో కూడా డీడబ్ల్యూఓ సుమ పాల్గొని కేక్ కట్ చేశారు. అలాగే, బాలికల హక్కులు, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాల్లో సఖి అడ్మిన్ సరిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతరాణి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విష్ణువందన, బాలల సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మి, ఉమెన్ డెస్క్ హెల్ప్‌లైన్ అధికారి సమ్రీన్, జీసీడీఓ భూలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, కోటేశ్వరమ్మతో పాటు వాసంతి, రజిని, రుక్మిణి పాల్గొన్నారు.

ఆధారాలు ఉంటే సరి..

నగదుతో వెళ్తూ చిక్కుల్లో పడకండి



ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యాన డిసెంబర్ 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిని కట్టడి చేసేందుకు విస్తృత తనిఖీలు చేస్తున్నందున ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని ఆయన ఓ ప్రకటనలో సూచించారు. అంతకంటే ఎక్కువ నగదును సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తే అధికారులు సీజ్ చేస్తారని తెలిపారు. ఈమేరకు అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు నగదును తీసుకెళ్లే వారు సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. నగదు డ్రా చేసిన అకౌంట్ పాస్ పుస్తకం లేదా ఏటీఎం చీటీ, వస్తువులు, ధాన్యం విక్రయం నగదైతే బిల్లు, భూమి విక్రయించిన సొమ్ము అయితే డాక్యుమెంట్లు, వ్యాపారం, సేవల నగదు అయితే లావాదేవీల వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, సీజ్ చేసిన నగదుకు సరైన ఆధారాలు ఉంటే కనక వాటిని సమర్పించేందుకు కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి ఏ.విజయకుమారి(94921 04983)ను సంప్రదించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు.

అందేనా.. ఆగినట్లేనా?!

- కోడ్ అమల్లోకి రావడంతో లబ్ధిదారుల్లో టెన్షన్
- దాదాపు పూర్తయిన దళితబంధు సర్వే
- గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు
- ఇప్పటికే ఇంటి నిర్మాణం మొదలుపెట్టిన పలువురు
- ఎన్నికల కోడ్ రావడంతో పథకాలు కొనసాగుతాయా, లేదా అని ఆందోళన



గృహలక్ష్మి లబ్ధిదారుడు నిర్మిస్తున్న ఇల్లు

మధిర: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది! పాత పథకాలేవి ఆగవని.. కొత్తవి మొదలుకావని అధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటికే మంజూరైన సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయో, లేదోనని లబ్ధిదారులకు గుబులు పట్టుకుంది. ఇటీవల రాష్ట్రప్రభుత్వం దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టింది. దళితబంధు ద్వారా దళితులకు రూ.10 లక్షలు మంజూరు చేస్తుండగా.. ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని ఆశించారు. అలాగే, డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాన్ని పక్కన పెట్టిన ప్రభుత్వం సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇచ్చేలా గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పలువురికి మంజూరు పత్రాలు అందజేయగా.. వందలాది మంది ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. అయితే రూపాయి బిల్లు రాకపోగా... ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అసలు పథకం ఉంటుందా, ఆగుతుందో తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదే ప్రభుత్వం వచ్చినా నిధులు విడుదల చేస్తుందా.. ఒకవేళ ప్రభుత్వం మారితే పథకం ఉంటుందా, లేదా అనే మీమాంస నెలకొంది.

పైలట్ ప్రాజెక్టుగా సత్తుపల్లి, బోనకల్

దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన తొలినాళ్లలో జిల్లాలోని చింతకాని మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మండలంలోని దళితులందరికీ పథకాన్ని వర్తింపజేశారు. మిగతా మండలాల్లో కూడా పలువురికి పథకం ద్వారా లబ్ధి చేకూరింది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ సత్తుపల్లి నియోజకవర్గం మొత్తమే కాక బోనకల్ మండలంలోని దళితులందరికీ పథకాన్ని వర్తింపచేస్తామని ప్రకటించారు. ఆయన చెప్పిన గంటల్లోనే జీఓ విడుదల కాగా.. గత శుక్రవారం అధికారులు సర్వే కూడా ప్రారంభించారు. ఆసమయంలోనే సత్తుపల్లి నియోజకవర్గంలో 25,143 మందికి, బోనకల్ మండలంలో 4,922 కుటుంబాలకు దళితబంధు అందుతుందని వెల్లడించారు. దీంతో దళిత కుటుంబాలు త్వరలోనే తమకు నగదు వస్తుందని.. యూనిట్లు స్థాపించి ఆర్థికాభివృద్ధి చెందుతామని ఆశించారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో అడుగు ముందుకు పడకపోగా.. సర్వే కూడా నిలిచిపోయింది.

బంధు.. బందేనా?

కొన్నాళ్ల క్రితం బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టారు. బీసీ బంధులో భాగంగా కులవృత్తుల వారి చేయూతకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించడంతో వేలాదిగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో గ్రామానికి ఇద్దరు లేదా ముగ్గురికి మాత్రమే చెక్కులు ఇచ్చారు. ఇక గృహలక్ష్మిలో భాగంగా వేలాది మందికి మంజూరు పత్రాలు ఇచ్చినా ఎవరి ఖాతాలోనూ నగదు జమ కాలేదు. అయినా నమ్మకంతో పలువురు అప్పు చేసి మరీ ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ పక్కనపెడితే రైతుల రుణమాఫీ విషయంలోనూ గందరగోళం నెలకొంది. పలువురు రైతుల రుణాలు మాఫీ చేసినా అర్హులు ఇంకా వేలల్లో ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చినా నేపథ్యాన తమకు ఆతర్వాతైనా రుణ మాఫీ జరుగుతుందా, లేదా అన్న ఆలోచనలో పడ్డారు.

రుణమాఫీ కాలేదు



ఇంతవరకు రుణమాఫీ కాలేదు. బ్యాంకు, వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ఎవరిని అడిగినా సరిగ్గా చెప్పడం లేదు. డబ్బు జమ అయితేనే వచ్చినట్లని చెబుతున్నారు. రుణమాఫీ వస్తుందో, లేదోనని చూస్తుండగానే కోడ్ రావడంతో ఏమీ అర్థం కావడం లేదు.

– చల్లా మాధవరెడ్డి, రైతు, మర్లపాడు

డబ్బు మంజూరు చేయాలి



సొంత స్థలంలో ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టాం. కొంతవరకు పనులు కూడా పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ రాక ముందే మమ్మల్ని గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేసి మంజూరు పత్రాలు ఇచ్చారు. అందుకే కోడ్ పేరుతో ఆపకుండా విడతల వారీగా నిధులు జమ చేయాలి.

–దట్టి కనకమహాలక్ష్మి, గృహలక్ష్మి లబ్ధిదారు, మర్లపాడు

క్లుప్తంగా

జిల్లా లైబ్రరీకి రూ.33 వేల విలువైన పుస్తకాలు



లైబ్రరీకి పుస్తకాలు అందిస్తున్న దాతలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి హైదరాబాద్‌కు చెందిన దేవహుతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కోఫౌండర్ మెంట నారాయణరావు రూ.33 వేల విలువైన పుస్తకాలను అందించారు. ఈసందర్భంగా బుధవారం ఆయన పుస్తకాలు అందజేయగా గ్రంథాలయ బాధ్యులు, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి అర్జున్, ఉద్యోగులు భాస్కర్ రావు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ప్రవేశద్వారం మార్పు



బ్యాంక్, కళాశాలను వేరు చేస్తూ నిర్మించిన ప్రహరీ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం పాత కలెక్టరేట్‌ను మెడికల్ కళాశాలకు కేటాయించగా బోధన ప్రారంభమైంది. అయితే, కళాశాల ఆవరణలోకి బయట వ్యక్తులను రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రెండు ప్రవేశ ద్వారాల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించగా, కళాశాల ఆవరణలోనే బ్యాంక్ ఉండటంతో వినియోగదారులు రావాల్సి వస్తోంది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు బ్యాంక్ అధికారులతో చర్చించగా.. వారు వినియోగదారులు కళాశాలలోకి రాకుండా బ్యాంకుకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేశారు. అంతేకాకుండా బ్యాంక్, కళాశాలను వేరుచేస్తూ మధ్యలో ప్రహరీ నిర్మించడంతో కళాశాలలోకి ఇతరులు రాకుండా కట్టడి చేసినట్లయింది.

వాహన తనిఖీలో రూ.1.64 లక్షలు సీజ్

కల్లూరు: కల్లూరులోని సరిహద్దు చెక్‌పోస్ట్‌లో పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యాన బుధవారం వాహనంలో తీసుకెళ్తున్న రూ.1.64 లక్షల నగదును సీజ్ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ పి.రఘు తెలిపారు.

పట్టుబడిన నగదుపై విచారణ

నేలకొండపల్లి: మండలంలోని బౌద్ధక్షేత్రం వద్ద పోలీసులు మంగళవారం పమ్మికి చెందిన రఘుపతి నుంచి రూ.2.80 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పి.వేణుమనోహర్ బుధవారం విచారణ చేపట్టారు. పూర్తి ఆధారాలను సమర్పించి నగదు తీసుకెళ్లాలని సూచించారు.

డెంగీతో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: డెంగీ బారిన పడిన వ్యక్తి ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. మండలంలోని ఎర్రగడ్డకు చెందిన బత్తుల నవీన్ (43) కుమారుడి చదువు కోసం కుటుంబంతో సహా ఖమ్మంలో ఉంటున్నాడు. కొద్ది రోజులుగా ఆయనకు జ్వరం వస్తుండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే, మంగళవారం రాత్రి నవీన్ ఆరోగ్యం విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఆయనకు భార్య వసంత, కుమారుడు ఉన్నారు.

పేకాట ఆడుతున్న వారిపై కేసు

కామేపల్లి/తిరుమలాయపాలెం: పేకాట ఆడుతూ పట్టుబడిన వారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కామేపల్లి మండలం బర్లగూడెం శివారు శ్మశానవాటిక సమీపాన పేకాట ఆడుతున్నారనే సమాచారం అందటంతో తనిఖీ చేసి రూ.1,320 నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఐదుగురిలో ఇద్దరు పట్టుబడగా ముగ్గురు పరారయ్యారని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే, తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి చెరువు వద్ద ఎస్ఐ వరాల శ్రీనివాస్ ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో పేకాట ఆడుతూ ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో మద్యం మత్తులో కారుకు అడ్డుగా రావడమే కాక దాడి చేసిన ఇద్దరిపై రఘునాథపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన ఉద్యోగి ఎన్.విద్యాసాగర్ పెళ్లి సంబంధం విషయమై కుటుంబీకులతో ఈనెల 2న కారులో వచ్చివెళ్తుండగా వేపకుంట్లలో బి.జాన్, డి.పవన్‌కుమార్ అడ్డుగా వచ్చారు. తప్పుకోవాలని కోరగా మద్యం మత్తులో ఉన్న వారు తమపై దాడి చేశారని విద్యాసాగర్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

ఏజెన్సీ సంపదను కొల్లగొడుతున్నారు..

- ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం
- పోలీసు, రెవెన్యూ అధికారులు కేసీఆర్‌కు తొత్తులు..
- బీసీలకు 60 – 70 సీట్లు కేటాయిస్తాం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్



కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

కొత్తగూడెం అర్బన్: ఏజెన్సీ సంపదను అగ్రవర్ణాల ఖాతాల్లోకి మళ్లిస్తూ గిరిజనులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఉద్యోగులకు నెలనెలా వేతనాలు, ఆసరా పింఛన్లు ఇవ్వలేక చతికిల పడుతోందని ఎద్దేవా చేశారు. కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పోడుపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు బీసీల ఓట్లతో గద్దెనెక్కుతున్నాయని, వారికి అసెంబ్లీ టికెట్లు ఇవ్వడంలో మాత్రం వివక్ష చూపుతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తాము బీసీలకు 60 నుంచి 70 అసెంబ్లీ సీట్లు ఇస్తామని ప్రకటించారు.

భూదందాపై విచారణ చేయాలి..

పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇసుక అక్రమ ర్యాంపులు, భూదందాలపై విచారణ జరపాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తనయుడు రాఘవ అధికార అహంతో రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నాడని, ఓ కుటుంబంలో నలుగురి ఆత్మహత్యకు కారకులయ్యాడని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పి యువకుడు, విద్యావంతుడైన యెర్రా కామేష్‌ను గెలిపించాలని కోరారు. చావులు, పెళ్లిళ్లకు రూ. 5000 ఇచ్చే వారిని నమ్మి మోసపోవద్దన్నారు.

జిల్లాపై పట్టింపేది ?

భద్రాచలం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.100 కోట్ల నిధులు ఏమయ్యాయని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. భద్రాద్రి రామయ్యను కన్నెత్తి చూడని తండ్రీకొడుకులు కేసీఆర్, కేటీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. కొత్తగూడెంలో విమానాశ్రయం, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తానన్న సీఎం హామీలు అటకెక్కాయని విమర్శించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరందించే కాళేశ్వరం ప్రాజెక్టును ఆగమేఘాల మీద పూర్తి చేసిన ప్రభుత్వం, సీతారామా ప్రాజెక్టును సకాలంలో ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఎస్టీల భూములు లాక్కున్నా, దళిత, బీసీ బంధు పథకాలో కమీషన్లు అడుగుతున్నా ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాల్లా మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. అంతకు ముందు కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం అసెంబ్లీ అభ్యర్థి యెర్రా కామేష్, జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బండి రమణి, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు, సాయి, సిర్ల మణీసాయి, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజం మర్చిపోయిన కామ్రేడ్లు

చండ్రుగొండ: కమ్యూనిజాన్ని మర్చిపోయిన కామ్రేడ్లు సీట్ల కోసం దొరల గడీల దగ్గర కాపలా కాస్తున్నారని ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. చండ్రుగొండలో పార్టీ కార్యకర్త కంచర్ల రాములు కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చే సీట్ల కోసం ఫామ్‌హౌస్ వద్ద పడిగాపులు కాశారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తలుపు తడుతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ డబ్బు, మద్యం భారీగా పారించబోతోందని, తాము అధికారంలోకి రాగానే బెల్ట్‌షాపులు రద్దు చేస్తామన్నారు. ఈ సారి రాష్ట్రంలో తమకు అధికారం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

వరి, మిరప పంటల్లో తెగుళ్లు

- సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టండి
- రైతులకు అవగాహన కల్పించిన డీఏఓ విజయనిర్మల



రైతుతో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

ఖమ్మంవ్యవసాయం: వాతావరణ అననుకూలతతో జిల్లాలోని వరి, మిరప పైర్లలో తెగుళ్లు ఆశించినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించి వరి, మిరప పంటలను పరిశీలించారు. అలాగే, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో అధిక మొత్తంలో సాగైన వరిని అగ్గితెగులు ఆశించిందని, ఈ తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్, టెబుకొనజోల్ వంటి క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే, మిరపను ఆశించిన ఎండు తెగులు నివారణకు ట్రైకోడర్మా విరిడీని భూమిలో వాడాలని సూచించారు. కాపర్‌ఆక్సీక్లోరైడ్ వినియోగిస్తున్న రైతులు చెట్ల మొదళ్లలో మందు ద్రావణం పోయాలని ఆమె తెలిపారు. కాగా, ఖమ్మం అర్బన్ మండలంలో పైలట్ ప్రాజెక్టుగా సాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఖమ్మం వ్యవసాయ డివిజన్ పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం డీఏఓ విజయనిర్మల తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాలను పరిశీలించడంతో పాటు పాయింట్ ఆఫ్ సేల్ విధానం అమలుపై ఆరా తీశారు. నిబంధనల మేరకు ఎరువులు, పురుగుమందుల విక్రయాలు చేపట్టాలని, ప్రతీ అమ్మకం వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని యజమానులకు సూచించారు. ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయాధికారి బి.కిశోర్‌బాబుతో పాటు ఏఈఓలు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏఓ విజయనిర్మల

24 గంటల విద్యుత్ అందించాలి



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాలో నాయకులు, రైతులు

వేంసూరు: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, ఇతర పంటలు చివరి దశలో ఉండగా సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నందున 24 గంటల పాటు విద్యుత్ అందించాలని కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ డిమాండ్ చేశారు. ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం వేంసూరు మండలంలోని వెంకటాపురం, కందుకూరు, దుద్దెపూడి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా విద్యుత్ సక్రమంగా అందక పొలాలు ఎండిపోతున్న విషయాన్ని రైతులు వివరించగా, కందుకూరు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. ఇకనైనా విద్యుత్ విషయంలో స్పందించాలని డిమాండ్ చేశారు. కాగా, తమ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని వెల్లడించారు. నాయకులు అట్లూరి సత్యనారాయణరెడ్డి, బండి గురునాథరెడ్డి, గొర్ల వెంకటప్పరెడ్డి, చీపు కృష్ణ, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీవీసీ ట్రస్ట్ సేవలు అభినందనీయం



కలెక్టర్‌కు అంబులెన్స్ అందిస్తున్న రాజేంద్రప్రసాద్

ఖమ్మంఅర్బన్: పేదలకు అత్యవసర సమయంలో ఉపయోగపడేలా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అత్యాధునిక అంబులెన్స్‌ను సమకూర్చిన వీవీసీ, వీఆర్‌పీ సంస్థల సేవలు అభినందనీయమని కలెక్టర్ గౌతమ్ అన్నారు. రూ.25లక్షల విలువైన అంబులెన్స్‌ను సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్(రాజా) బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు ఈఅంబులెన్స్‌కు వెంటిలేటర్ సౌకర్యం ఏర్పాటుచేయడమే కాక ఫ్రీజర్ కూడా అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీసీహెచ్ వెంకన్న, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు అర్ధంతరంగా నిలిచిన నేపథ్యాన ఇప్పటికే బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లనైనా రిలీవ్ చేయాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం డీఈఓ సోమశేఖరశర్మకు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, కొందరి వ్యక్తిగత స్వార్థంతో బదిలీలు, పదోన్నతులు నిలిచిపోయాయని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగకుండా ప్రభుత్వమే చొరవతీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బుర్రి వెంకన్న, షేక్ రంజాన్, వల్లంకొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణ ప్రథమ వర్ధంతి సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు చావా దుర్గాభవాని, జియావుద్దీన్, మహబూబ్‌అలీ, నర్సింహారావు, రాజశేఖర్, వీరబాబు, మాధవరావు, ఆనందాచారి పాల్గొన్నారు.

జిల్లా అండర్-19 క్రీడా జట్లు సిద్ధం



బాలికల కబడ్డీ జట్టు



బాలుర వాలీబాల్ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: అండర్-19 బాలబాలికల వాలీబాల్, కబడ్డీ జట్లతో పాటు బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పూర్తయింది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ఎంపిక పోటీలకు 200 మందికిపైగా బాలబాలికలు పాల్గొన్నారు. ఈ మేరకు జట్ల వివరాలను జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి ఎండీ మూసాకలీం ప్రకటించారు. ఈ పోటీలను డీవైఎస్ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి, డీఐఈఓ రవిబాబు, వాలీబాల్ సంఘం జిల్లా కార్యదర్శి బి.గోవిందరెడ్డి, కోచ్ ఎండీ అక్బర్‌అలీ, కబడ్డీ సంఘం కార్యదర్శి కె.కృష్ణఫర్‌బాబు, పీడీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

వాలీబాల్: బాలుర జట్టుకు విష్ణువర్ధన్, సిద్ధార్థ, మహర్షి, సుమంత్‌కుమార్, అభిరాం, తరుణ్, బాషా, మనోజ్‌కుమార్, చందు, త్రివిక్రమ్, రామశేఖర్, దిలీప్‌కుమార్, బాలికల జట్టుకు రిషిత, సంధ్య, బేబీ, పూజిత, శ్రీఅక్షిత, ప్రత్యూష, ఉమాశ్రీ, మాధురి, శ్యామల, వైష్ణవి, శ్రీసాయి, ధనుష, నాగజానకీ, వర్షిత, జ్యోతి ఎంపికయ్యారు.

కబడ్డీ: కబడ్డీ బాలుర జట్టుకు అజయ్, రాకేశ్, దిలీప్, వేణు అభినయ్, అజీమత్, గోపి, రాం, హేమేశ్, చరణ్, రోహిత్‌కుమార్, ఉదయ్‌కుమార్, సలీంపాషా, హితేశ్, రామకృష్ణ, గోపాల్‌రావు ఎంపిక కాగా, బాలికల జట్టుకు నాగమణి, శివేశ్వరీ, ఉమారాణి, సౌమ్య, సురక్షిత, నాగశ్రీ, హారిక, విజయలక్ష్మి, చాందిని, జ్యోత్స్న, నీరజ, చందన, పార్వతి, సంజన, అనూష ఎంపికయ్యారు.

బాలికల ఫుట్‌బాల్ జట్టు : తేజ, సౌమ్య, స్వప్న, నవ్య, శిరీష, మాధురి, వైష్ణవి, శ్వేత, ఐశ్వర్య, అనూ, నవ్య, సంజన, వరలక్ష్మి, ప్రవళిక, శ్రీవల్లి, కావ్య, అశ్విత, అభినయశ్రీ, సంధ్య ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు.

బోర్ మోటార్ సమకూర్చిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు



బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోర్ మోటార్ దెబ్బతినడంతో నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, అధ్యాపకులు రూ.25 వేలు జమ చేసి కొత్త మోటార్ కొనుగోలు చేసి మంగళవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మోటార్ పాడై ఏడాది దాటినా మరమ్మతు చేయించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీంతో తనతో పాటు అధ్యాపకులు, సిబ్బంది నగదు సమకూర్చి కొత్త మోటార్ కొనుగోలు చేశామని తెలిపారు. అధ్యాపకులు మల్లిక, జయప్రకాశ్, దుర్గాప్రసాద్, వనిత, పార్థసారధి, రమ, లక్ష్మీనారాయణ, రాంబాబు, యాకయ్య, ఖాసీం, బాబూరావు, కవిత, కృష్ణవేణి, పాషా, సుధీర్, సతీశ్, లైబ్రేరియన్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం

నేలకొండపల్లి: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఖమ్మం ఏఈఎస్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యాన బుధవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో, టాటా ఏస్, బొలేరోను అత్యధికంగా పాడిన వారికి కేటాయించామని, మొత్తంగా రూ.6 లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. నేలకొండపల్లి సీఐ కుమ్మరి పోశెట్టి, ఎస్ఐలు పి.రాధాకృష్ణ, బి.శంకర్, పి.సందీప్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టీఓలో విరిగిపడ్డ భారీ వృక్షం

తప్పిన పెనుప్రమాదం



విధులు నిర్వర్తిస్తున్న ఎంవీఐ వరప్రసాద్



విరిగిపడిన భారీ చెట్టు

ఖమ్మంక్రైం: జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం పెనుప్రమాదం తప్పింది. డ్రైవింగ్ ట్రాక్ సమీపాన ఉన్న భారీ వృక్షానికి ఫిట్‌నెస్ కోసం వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఎంవీఐ వరప్రసాద్, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి తప్పించుకోవటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. రోజుమాదిరిగా ఎంవీఐ వరప్రసాద్ బుధవారం కూడా కార్యాలయ ఆవరణలోని ట్రాక్‌పైన ఉన్న చిన్నపాటి గుడిసెలో నుంచి వాహనాల లైసెన్స్, రిజిస్ట్రేషన్లకు పత్రాలను పరిశీలిస్తున్నారు. ఇంతలోనే ఫిట్‌నెస్ కోసం టిప్పర్‌తో వచ్చిన డ్రైవర్ రివర్స్ తీసుకునే క్రమంలో చెట్టును ఢీకొట్టగా కూలిపోయింది. అయితే, వాహనదారులు తక్కువ మంది ఉండడం.. ఎంవీఐ విధులు నిర్వర్తిస్తున్న గుడిసెపై కాకుండా పక్కన పడడంతో ప్రమాదం తప్పినట్లయింది.

రూ.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత



ఖమ్మంక్రైం: స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు



నేలకొండపల్లి: నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు బుధవారం సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో రూ.10 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి ముంబైకి వెళ్లే రైలులో భారీ ఎత్తున గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగిన రైలులో తనిఖీలు చేస్తుండగా ఒడిశాకు చెందిన ఆరుగురి వద్ద 40 కేజీలకు పైగా గంజాయి లభించింది. కాగా, వీరి వెనుక ఎవరున్నారనే అంశంపై విచారణ చేపడుతున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి, జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు.

నేలకొండపల్లిలో పది కేజీలు..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని కూసుమంచి – నేలకొండపల్లి ప్రధాన రహదారిపై నందిగామ బ్రాంచ్ కెనాల్ వద్ద బుధవారం ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన పుష్కర్ పరిచ్చా.. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి కాలినడకన వెళ్తుండగా అధికారులు అడ్డుకున్నారు. దీంతో ఆయన పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకుని విచారించడంతో రూ.2.50 లక్షల విలువైన 9.825 కేజీల గంజాయి లభించిందని ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టి తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు పి.రాధాకృష్ణ, బి.శంకర్, పి.సందీప్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6 వేల విలువైన మద్యం పట్టివేత

రఘునాథపాలెం: మండల కేంద్రంలో ఎన్నికల విభాగం ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, రఘునాథపాలెం సీఐ శ్రీధర్ ఆధ్వర్యాన బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వరాలు అనే వ్యక్తి కిరాణం షాపులో రూ.6 వేల విలువైన మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పాతర్లపాడులో...

చింతకాని: మండలంలోని పాతర్లపాడులో ఓ షాపు నుంచి పోలీసులు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని పద్మ నిర్వహిస్తున్న షాపులో తనిఖీ చేయగా, రూ.16,380 విలువైన మద్యం లభించడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు నాటు తుపాకులు స్వాధీనం

జూలూరుపాడు: రెండు తుపాకులతో పారిపోతున్న నలుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ కథనం ప్రకారం.. మండలంలోని సురారంలో పోలీసులు బుధవారం రాత్రి కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సురారం అటవీ ప్రాంతంలోకి నలుగురు వ్యక్తులు తుపాకులతో పారిపోతున్నారు. గమనించిన పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. అటవీ జంతువులను వేటాడే వీరు కొన్ని నెలల క్రితం చండ్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన భూక్యా హరి వద్ద రూ.4 వేల చొప్పున రెండు నాటు తుపాకులను కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపడుతుండగా, భయపడి అటవీలో దాచి పెట్టేందుకు వెళ్తూ పట్టుబడ్డారు. నిందితులు జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామానికి చెందిన ముక్తి నరసింహారావు, ఏన్కూరు మండలం నాచారానికి చెందిన భాగం కన్నయ్య, సురారానికి చెందిన గడ్డి రాములు, చండ్రుగొండ మండలం బెండాలపాడుకు చెందిన గుర్రం మునయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ముక్తి నరసింహారావు నల్లబండబోడు సర్పంచ్. జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, చండ్రుగొండ ఎస్ఐ మాచినేని రవి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

పాల్వంచరూరల్: లారీ నడుపుతూ గుండెపోటుతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కారేపల్లి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ముప్పారపు శ్రీనివాసరావు(58) ఈ నెల 8న జామాయిల్ కర్రల లోడ్‌తో సారపాక ఐటీసీకి వెళ్లాడు. తిరిగి లారీ నడుపుకుంటూ వస్తుండగా మంగళవారం రాత్రి పాల్వంచ మండలం రంగాపురం గ్రామ శివారులో గుండెపోటు రావడంతో అదుపు తప్పి లారీ రోడ్డు పక్కన చెట్లపొదలోకి వెళ్లింది. అటుగా వెళ్తున్న వ్యక్తి గమనించి ఆటోలో ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గుడికంట్ల సుధాకర్ తెలిపారు.

హైకోర్టు జడ్జీలుగా నలుగురి పేర్లు సిఫారసు

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు నలుగురు న్యాయవాదుల పేర్లను కేంద్రానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన వారిలో హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నూనేపల్లి హరినాథ్, న్యాయవాది మండవ కిరణ్మయి, ప్రభుత్వ న్యాయవాదిగా వ్యవహరిస్తున్న జగడం సుమతి, న్యాయవాదిగా ఉన్న న్యాపతి విజయ్ ఉన్నారు. ఈ నలుగురి పేర్లుకు కేంద్రం ఆమోదముద్ర వేసిన తరువాత ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా రాష్ట్రపతికి చేరతాయి. రాష్ట్రపతి ఆమోదముద్ర తరువాత వీరి పేర్లను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేస్తుంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరి 22న హైకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా (ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తి) నేతృత్వంలోని కొలీజియం ఏడుగురు న్యాయవాదుల పేర్లను హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు సిఫారసు చేసింది. హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్, యర్రంరెడ్డి నాగిరెడ్డి, ఎస్.రవిప్రసాద్, అశ్వత్థనారాయణ పేర్లను సుప్రీంకోర్టుకు పంపింది. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి కూడా ఈ పేర్లపై తమ అభిప్రాయాలు పంపారు. అనంతరం కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ద్వారా రహస్య విచారణ జరిపి ఈ ఏడుగురి వివరాలు తెప్పించుకుంది. ఫిబ్రవరి నుంచి ఈ ఏడుగురి పేర్లు కేంద్రం వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ఈ ఏడుగురి పేర్లను కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టుకు పంపింది. ఈ ఏడుగురి పేర్లపై చర్చించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. అంతకుముందే ఈ ఏడుగురి గురించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో గతంలో న్యాయమూర్తులుగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్నవారి అభిప్రాయాలు కూడా తీసుకుంది. మంగళవారం జరిగిన కొలీజియం సమావేశంలో హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్ పేర్లకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులుగా ఈ నలుగురిని నియమించే విషయంలో వీరి నైతికనిష్ఠకు సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి ప్రతికూల నివేదికలు లేవని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నలుగురు హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం అయ్యేందుకు అన్ని రకాలుగా అర్హులని స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి మాత్రం న్యాపతి విజయ్ విషయంలో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. ఏడుగురిలో మిగిలిన ముగ్గురి విషయంలో సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం ఏమిటన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు. ప్రస్తుతం హైకోర్టులో సీజేతో సహా 27 మంది న్యాయమూర్తులున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు సిఫారసు చేసిన నలుగురి పేర్లకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరుకుంటుంది.

ఇన్నర్ కేసులో చంద్రబాబుకు తాత్కాలిక ఊరట

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు, క్విడ్ ప్రోకో ఆరోపణలపై సీఐడీ నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు హైకోర్టు బుధవారం తాత్కాలిక ఊరటనిచ్చింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌లో తదుపరి ముందుకెళ్లొద్దని విజయవాడ ఏసీబీ కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 16వరకు పీటీ వారెంట్ విషయంలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయవద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో తదుపరి ఎలాంటి సమయం ఇచ్చే ప్రసక్తేలేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒకవేళ సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో ఏదైనా కేసులో వాదనలు వినిపించాల్సి ఉంటే ఒక్కరోజు మాత్రమే గడువునివ్వడం సాధ్యమవుతుందని తేల్చి చెప్పారు.

'రింగ్' మాస్టర్ అష్ట వంకర్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేశ్‌కు సీఐడీ ప్రశ్నల వర్షం

- 'ఉప సంఘం' వ్యవహారంపై ప్రశ్నలకు తడబాటు
- హెరిటేజ్ భూముల అంశంపై ప్రశ్నలకు బిత్తరచూపులు
- కరకట్ట నివాసంపై ప్రశ్నించేసరికి కస్సుబుస్సు
- విలేకరుల సమావేశంలోనూ అదే తీరు
- 'సాక్షి'పై అసత్య ఆరోపణలతో విషయాన్ని పక్కదారి పట్టించే యత్నం
- ఇతర విలేకరుల ప్రశ్నలకు చిందులు..
- నేనెక్కడికి వెళ్తానో మీకనవసరం అంటూ అసహనం



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎన్ని వంకర్లు తిప్పారో.. ఆ కేసులో నిందితుడు నారా లోకేశ్ సీఐడీ విచారణలో ప్రశ్నలకు అన్ని వంకర్లు తిరిగారు. చంద్రబాబు కుటుంబం, ఆయన అస్మదీయుల భూము ల విలువ అమాంతంగా పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చిన తీరుపై సీఐడీ అధికా రులు అడిగిన సూటి ప్రశ్నలకు లోకేశ్ నేల చూపులు చూశారు. తాను సభ్యుడిగా ఉన్న మంత్రివర్గ ఉప సంఘం ద్వారానే అక్రమాల కథ నడిపిన తీరును సీఐడీ ఆధారాలతో సహా ముందు పెట్టడంతో బిత్తరపోయారు. హెరిటేజ్ భూముల కొనుగోలు, లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట నివాసంపై ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయారు. విచారణకు సహకరించకుండా దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు యత్నించారు.

ఈ కేసులో ఏ–14గా ఉన్న లోకేశ్‌ను సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు వరుసగా రెండో రోజు బుధవారం తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో విచారించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ దర్యాప్తునకు సహకరించకుండా ఉండేదుకు లోకేశ్ అనేక ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ సిట్ బృందం తమదైన శైలిలో కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయన న్యాయవాది సమీప దూరంలో ఉండగా ఆడియో, వీడియో రికార్డింగ్ నిర్వహిస్తూ అధికారులు లోకేశ్‌ను విచారించారు. విశ్వసనీయ సమచారం ప్రకారం ఈ దర్యాప్తునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అలైన్‌మెంట్ మార్చాలని ఎందుకు ఒత్తిడి చేశారు?

ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు అమరావతి కోర్ కేపిటల్‌పై టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రివర్గ ఉప సంఘం ద్వారా అక్రమాల కథ నడిపిన తీరుపై సీఐడీ లోకేశ్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. జూనియర్ మంత్రి అయినప్పటికీ లోకేశ్‌కు ఉప సంఘంలో స్థానం కల్పించడంపై మొదటగా ప్రశ్నించింది. పేరుకు మంత్రివర్గ ఉప సంఘం అయినప్పటికీ ఇతర సభ్యులకంటే అందులో లోకేశ్, నారాయణదే హవా అని, భూ సమీకరణ, ఇన్నర్‌రింగ్ రోడ్డుకు భూసేకరణపై వీరే కీలకంగా వ్యవహరించినట్టు సీఐడీ ఆధారాలు సేకరించింది. వాటిని లోకేశ్‌కు చూపిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని సీఆర్‌డీఏ అధికారులపై ఎందుకు ఒత్తిడి చేశారని ప్రశ్నించింది. తామేమీ ఒత్తిడి చేయలేదని లోకేశ్ బుకాయించారు. మంత్రివర్గ ఉపసంఘం, టీడీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే అలైన్‌మెంట్‌ను మార్చినట్లు అప్పటి సీఆర్‌డీఏ అధికారులు వాంగ్మూలం ఇచ్చిన అంశాన్ని సీఐడీ అధికారులు ప్రస్తావించడంతో లోకేశ్ షాక్ తిన్నారు. దాంతో ఆయన నోట మాట రాలేదని సమాచారం. వెంటనే తన న్యాయవాదితో సంప్రదించి చెబుతానని చెప్పారు. న్యాయవాదితో మాట్లాడిన తరువాత కూడా ఆయన ఈ అంశంపై సమాధానం దాట వేసేందుకే ప్రయత్నించారు. ముందుగానే సీఆర్‌డీఏ అధికారులతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించి, దానినే మాస్టర్‌ప్లాన్‌లో చేర్పించి సింగపూర్‌కు చెందిన కన్సల్టెన్సీ ద్వారా ఆమోదింపజేయడం అంటే అక్రమమే కదా అని అధికారులు ప్రశ్నించడంతో లోకేశ్ మౌనంగా ఉండిపోయారు. మంత్రివర్గ ఉప సంఘం వ్యవహారం అంతా బూటకమని, ఆ ముసుగులో చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతంగా పెంచుకున్నారని సీఐడీ కీలక ఆధారాలు చూపించడంతో లోకేశ్ నిశ్చేష్టుడయ్యారు.

కరకట్ట నివాసం అంశంపై కస్సుబుస్సు

లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట బంగ్లాపై సీఐడీ ప్రశ్నించడంతో లోకేశ్ తత్తరపాటుకు గురై అధికారులపై కస్సుబుస్సులాడారు. ఆ ఇంటికి తాము అద్దె చెల్లించామన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు చూపిస్తూ ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌ను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. దర్యాప్తులో భాగంగా ఏ పత్రాలనైనా సంబంధిత శాఖలను సంప్రదించి తీసుకునే వెసులుబాటు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు ఉందనే అవగాహన ఆయనకు లేకపోవడం విడ్డూరం. లింగమనేని రమేశ్ ఆ కరకట్ట నివాసాన్ని ఉచితంగా ఇచ్చానని ఓసారి, కాదు దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని మరోసారి చెప్పిన విషయాలను అధికారులు ప్రస్తావించారు. దాంతో అసలు తనకు ఆ కరకట్ట నివాసం గురించి తెలియదని లోకేశ్ బుకాయించారు. మంత్రి హోదాలో మీరు నివసించిన ఇంటి గురించి తెలియదా అని అధికారులు రెట్టించి అడిగేసరికి సమాధానం దాటవేశారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి మరికొన్ని కీలక వ్యవహారాలపై లోకేశ్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. కానీ ఆయన నుంచి సరైన సమాధానం రాలేదు. వీలైనంతవరకు దర్యాప్తునకు సహకరించకుండా విషయాన్ని పక్కదారి పట్టించేందుకే లోకేశ్ యత్నించారు. పలువురు అధికారుల పేర్లను ప్రస్తావిస్తూ వారిని ప్రశ్నించాలని సీఐడీకి సూచించడం హాస్యాస్పదంగా మారింది. దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన నిందితుడు తిరిగి ఇతరలను ప్రశ్నించాలని చెబుతుండటం విడ్డూరంగా ఉందని సీఐడీవర్గాలు వ్యాఖ్యానించాయి. అవసరమైతే మరోసారి విచారణకు రావల్సి ఉంటుందని సీఐడీ అధికారులు లోకేశ్‌కు చెప్పి బుధవారం విచారణ ప్రక్రియను ముగించారు.

హెరిటేజ్ భూముల అంశంపై అసహనం..

➤ ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్ భూములు కొన్న అంశంపై సీఐడీ సూటి ప్రశ్నలకు లోకేశ్ తీవ్ర అసహనానికి గురయ్యారు. ఏ ప్రాతిపదికన ఆ ప్రాంతంలో భూములు కొనాలని హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అధికారులు వేసిన ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమివ్వలేదు. ప్రస్తుతం తాను హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా లేనని, ఆ విషయాలు తనకు తెలియవని అన్నారు. భూములు కొనాలని తీర్మానించిన సమయంలో మీరే డైరెక్టర్‌గా ఉన్నారు కదా అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేయడం గమనార్హం.

సంబంధం లేని ప్రశ్నలువేశారు: లోకేశ్

సీఐడీ అధికారులు తనకు ఏమాత్రం సంబంధం లేని ప్రశ్నలు వేశారని లోకేశ్ చెప్పారు. రెండో రోజు విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని ఈ విచారణ ద్వారా తనకు తెలిసిందన్నారు. కరకట్ట నివాసానికి తన తల్లి అద్దె చెల్లించారన్నారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. సాక్షి పత్రికలో షేర్లను కొందరు కొన్నట్లుగా తమ హెరిటేజ్ ఫుడ్స్ షేర్లను లింగమనేని కొనలేదని వ్యాఖ్యానించారు.

'సాక్షి' ప్రశ్నలకు తత్తరపాటు

ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంలో లోకేశ్ పాత్రపై 'సాక్షి' ప్రతినిధులు ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. సాక్షి పత్రికపై అసత్య ఆరోపణలు చేసి విషయాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించారు. కానీ సాక్షి ప్రతినిధులు సూటి ప్రశ్నలు సంధించడంతో తత్తరపాటుకు గురయ్యారు. ఇతర మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. లోకేశ్‌తో సాక్షి, ఇతర మీడియా ప్రతినిధుల సంభాషణ ఇలా సాగింది..

➤ **సాక్షి:** మీరు మంత్రివర్గ ఉప సంఘంలో సభ్యుడయ్యాకే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని, హెరిటేజ్‌ఫుడ్స్‌కు భూములు కొన్నారన్న అభియోగంపై స్పందన ఏమిటి?

➤ **లోకేశ్:** మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడిగా నేను ఒత్తిడి చేసి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశానని సీఐడీ అంటోంది. కానీ అది నా శాఖకు ప్రమేయం లేని అంశం. అదే చెప్పా.

➤ **సాక్షి:** ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉన్న కంతేరు వైపు ఎందుకు మళ్లింది?

➤ **లోకేశ్:** సీఐడీ అధికారులు నాకు బాహుబలి సినిమా చూపించారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ గూగుల్ మ్యాప్ చూపించి ప్రశ్నించారు. ఆ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని నాకు అర్థమైంది.

➤ **సాక్షి:** క్విడ్‌ప్రోకో కిందే లింగమనేని మీకు కరకట్ట బంగ్లా ఇచ్చారని సీఐడీ అభియోగం మోపింది కదా?

➤ **లోకేశ్:** మాకు క్విడ్ ప్రోకో అలవాటు లేదు. క్విడ్ ప్రోకో ద్వారా సాక్షి మీడియాలో పెట్టుబడులు పెట్టినట్టు మా హెరిటేజ్ ఫుడ్స్‌లో ఎవరూ పెట్టుబడులు పెట్టలేదు.

➤ **సాక్షి:** మరి మీకు మాత్రమే లింగమనేని ఆ కరకట్ట బంగ్లాను ఎందుకు ఇచ్చారు?

➤ **లోకేశ్:** ఆ ఇంటికి మేము అద్దె చెల్లిస్తున్నాం. ప్రభుత్వానికి ఆ మేరకు లేఖ కూడా రాశాం.

➤ **సాక్షి:** అదే నిజమైతే 2019కు ముందు ఎందుకు అద్దె చెల్లించలేదు?

➤ **లోకేశ్:** (వెంటనే సమాధానం చెప్పలేక మౌనం వహించారు. కాసేపటికి తేరుకుని..) ఆ విషయం నాకు తెలీదు. నాకు తెలిసినంతవరకు ఇప్పుడు అద్దె చెల్లిస్తున్నాం. మా అమ్మ ఐటీ రిటర్న్ రికార్డులు సీఐడీకి ఎలా వచ్చాయి? దీనిపై న్యాయపోరాటం చేస్తాం.

➤ **సాక్షి:** మీ సన్నిహితుడు కిలారు రాజేశ్ ఎందుకు పరారయ్యారు?

➤ **లోకేశ్:** ఆయన గురించి నాకేం తెలుస్తుంది? ఎక్కడ ఉన్నారో నాకు తెలీదు

➤ **ఇతర మీడియా ప్రతినిధులు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జైలుకు పంపారు అని మీరు అంటున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ విధించేది కోర్టులు కదా?

➤ **లోకేశ్:** ఈ కేసులో ఎఫ్ఐఆర్ వేసింది జగన్ ప్రభుత్వమే.అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు.

➤ **మీడియా ప్రతినిధులు:** మీరు మళ్లీ ఢిల్లీ వెళ్లిపోతారా?

➤ **లోకేశ్:** నేను ఎక్కడికి వెళ్తానో మీకు చెప్పాలా? అది మీకు అనవసరం. నేను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని. ఎక్కడికి వెళ్లినా షెడ్యూల్ ఇస్తా.

జిల్లా వార్తలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం



కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్‌జేడీ, తదితరులు

కామేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల నుంచి సన్నబియ్యం సరఫరా అవుతాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.ఝాన్సీలక్ష్మీబాయి తెలిపారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆమె ప్రీ స్కూల్ కార్యక్రమాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశమైన ఝాన్సీలక్ష్మీబాయి మాట్లాడుతూ.. కేంద్రాల్లో లబ్ధిదారులకు సక్రమంగా పోషకాహారం అందజేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఫ్లెక్సీలపై రాజకీయ నాయకుల ఫొటోలు కనిపించకుండా మూసివేయాలని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక





రూప, మధులత, జ్యోతిర్మయి గోపి

బోనకల్: జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల ఆర్మూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పాటు కె.రూప, కె.మధులత, టి.జ్యోతిర్మయి, జి.గోపిని ఎంపిక చేశారు. వారు ఈ నెల 15 నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ అమిరేసి లింగయ్య బుధవారం వెల్లడించారు.

రేపటి నుండి గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్

ములకలపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ములకలపల్లి గురుకులంలో శుక్రవారం నుండి నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. మండల కేంద్రంలోని గురుకులంలో బుధవారం ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 14 కళాశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థినులు అండర్ –14, 17, 19 విభాగాల్లో పోటీల్లో తలపడతారని వెల్లడించారు.

కేంద్ర నిధులు పక్కదారి

- పేరు మార్చుకుంటే బీఆర్ఎస్ జాతీయ పార్టీ కాదు..
- డబ్బులు మోదీవి.. ఫొటోలు కేసీఆర్‌వి
- కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ



సత్తుపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ, పక్కన నాయకులు

సత్తుపల్లి: రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తూ.. మోదీ ఫొటోల స్థానంలో కేసీఆర్ ఫొటోలు పెట్టుకుంటున్నారని కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ విమర్శించారు. సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్‌లో సింగరేణి బాంబుపేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్ల బాధితులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సింగరేణిలో 49శాతం వాటా కేంద్ర ప్రభుత్వం ఉన్నందున బాధితుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు. పేదవాడి బిడ్డకే పేదల కష్టం తెలుస్తుంది.. ఇళ్లు ఎప్పుడు కూలిపోతాయేనని భయపడుతూ జీవిస్తున్న బాధితులను చూస్తుంటే తన చిన్నతనంలో ఇల్లు గుర్తుకు వచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. కాగా, రాష్ట్రంలోని నాయకత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో సమస్య పరిష్కరించడం లేదని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన జాతీయ పార్టీ కాదని ఎద్దేవా చేశారు.

వెనుకబడిన వర్గాల కోసం 'విశ్వకర్మ'

వేంసూరు/కల్లూరు/పెనుబల్లి: వెనుబడిన వర్గల వారికి అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రారంభించారని కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. వేంసూరు, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో ఆయన పర్యటించగా.. వేంసూరులో హైవే పనులను పరిశీలించిన సందర్భంగా పలువురు రైతులు కలిసి సర్వీసు రోడ్డు ఇవ్వాలని కోరారు. ఆతర్వాత ఆయన మాట్లాడుతూ 18 కులాల చేతి వృత్తిదారులు సీఎస్‌సీ సెంటర్‌కు వెళ్లి పేరు నమోదు చేసుకుంటే విశ్వకర్మ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈపథకం ద్వారా రూ.5శాతం వడ్డీ రాయితీతో ఎలాంటి పూచీకత్తు లేకుండా విడదల వారీగా రుణాలు మంజూరవుతాయని చెప్పారు. అలాగే, కల్లూరులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వర్మ మాట్లాడగా పెనుబల్లి బీసీ కాలనీలోని కుమ్మరి వృత్తిదారుడు వీరస్వామి ఇంటి వద్ద కుండల తయారీని పరిశీలించారు.

ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణతో పాటు నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, పాలకొల్లు శ్రీను, ఆచంటి నాగస్వామి, పడిగల మధు లంబాడీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, త్రిలోక్, ఉమారాణి, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాస్, పర్స రాంబాబు, గుమ్మా రామకృష్ణ, గుండపనేని అనిల్, తుమ్మలపూడి పుల్లారావు, పానుగంటి కృష్ణయ్య, ఆమనమంచి కృష్ణమోహన్, వినయ్, త్రినాథ్, కనగాల వెంకట్రామయ్య, బొర్రా నరసింహారావు, నాయుడు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ మార్గాల్లో చెక్‌పోస్టులేవి?

- అక్రమార్కులకు రాజమార్గంగా దారులు
- కొన్ని ప్రాంతాలను విస్మరించడంపై విమర్శలు



అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి ఏపీలోకి వెళ్లే మార్గం

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యాన జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటుచేశారు. ఈ చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు చేపడుతుండగా రూ.లక్షల్లో నగదు పట్టుబడుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా మరికొన్ని మార్గాలను విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. ఆయా రహదారులను అక్రమార్కులకు రాజమార్గాలుగా ఎంచుకున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రెండు రాష్ట్రాల సరిహద్దు

తెలంగాణ – ఏపీ సరిహద్దులోని అశ్వారావుపేట నియోజకవర్గానికి ఆనుకుని ఏపీలోని ప్రాంతాలు ఉంటాయి. నియోజకవర్గ కేంద్రానికి చుట్టూ ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, చింతలపూడి మండలాల్లోని గ్రామాలు ఉండగా.. అశ్వారావుపేట నుంచి జీలుగుమిల్లి, అశ్వారావుపేట మండలంలోని నందిపాడు, కొత్తూరు గ్రామాల నుంచి ఏపీకి జాతీయ రహదారులు ఉంటాయి. అయితే, పోలీస్ శాఖ కేవలం మూడు చోట్ల మాత్రమే చెక్ పోస్టులు ఏర్పాటుచేసింది. ఇందులో నందమూరినగర్(అశ్వారావుపేట) చెక్ పోస్టు వద్ద రెండు రోజుల వ్యవధిలోనే రూ.6.91లక్షల నగదు పట్టుబడింది.

చెక్‌పోస్టులు లేని మార్గాలివే..

అశ్వారావుపేట మండలం నుంచి ఏపీలోకి ప్రవేశించేందుకు, ఇటు వచ్చేందుకు మూడు ప్రధాన రహదారులతోపాటు మరికొన్ని మార్గాలు కూడా ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక సరిహద్దు ప్రాంతాలైన అశ్వారావుపేట, నందిపాడు, కొత్తూరు వద్ద మాత్రమే చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. అయితే, అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి ఏపీలోని జీలుగుమల్లి మండలం కామయ్యపాలెం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గాలు ఉన్నాయి. అలాగే, అశ్వారావుపేట మండలం రామన్నగూడెం నుంచి ఏపీలోని జీలుగుమల్లి మండలం రాచన్నగూడెం నుంచి ఏపీలోకి, అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం క్రాస్ రోడ్ మీదుగా ఏపీలోని చింతలపూడిలోకి వెళ్లేందుకు సింగిల్ బీటీ రహదారులు ఉన్నాయి. వీటిలో ఎక్కడ కూడా చెక్‌పోస్టులు కానరావడం లేదు. ప్రధానంగా పాపిడిగూడెం మార్గాన్ని అక్రమార్కులు డబ్బు, మద్యం సరఫరాకు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంలోనే గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులు నగదు తరలిస్తుండగా రూ.14లక్షలకు పైగా స్వాధీనం చేసుకున్నారు. అయినా ఈసారి ఎన్నికల వేళ చెక్‌పోస్టులు ఏర్పాటుచేయకపోవడం గమనార్హం. ఈవిషయమై తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులు గుర్తించిన ప్రాంతాల్లోనే చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, మిగతాచోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా ఉంటుందని తెలిపారు.

ఈ దసరాకైనా ఇస్తారా ?!

- ఇన్సెంటివ్ కోసం జెన్‌కో ఉద్యోగుల ఎదురుచూపులు
- ఐదేళ్ల నుంచి కోరుతున్నా ఫలితం సున్నా



పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారం

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏటా రావాల్సిన ఇన్సెంటివ్‌ను యాజమాన్యం విడుదల చేయడం లేదు. ఈ అంశంపై అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాల బాధ్యులు యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఫలితం ఉండటం లేదు. ఏటా దసరాకు రావాల్సిన ఇన్సెంటివ్ విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ దసరా పండుగ నాటికైనా ఇస్తారా అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రతీ సంవత్సరం 15 రోజుల వేతనాన్ని ఇన్సెంటివ్‌గా అందించే సంస్థ ఐదేళ్లుగా ఇవ్వక పోవడంతో నిరాశతో ఉన్నారు. ఇదిలా ఉండగా ప్రతినెల ఒకటి, రెండో తేదీల్లో రావాల్సిన వేతనం 10వ తేదీ నుంచి 15వ తేదీ మధ్యలో ఇస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ విడుదల

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు గత జూలై నెల నుండి పెండింగ్‌లో ఉన్న డీఏ(కరువు భత్యం) విడుదలైంది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు 2.88 శాతం డీఏను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుండగా.. అక్టోబర్ నెలకు సంబంధించి నవంబర్‌లో వచ్చే వేతనంతో చెల్లిస్తారు. ఈ మేరకు జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేయగా.. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు వజీర్, డి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మేనిఫెస్టో విడుదలైతే పండుగే..



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎంపీ కవిత, పక్కన ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

- మహబూబాబాద్ ఎంపీ కవిత
- ఇల్లెందులో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

ఇల్లెందు: సీఎం కేసీఆర్ ఈ నెల 15న ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించనున్నారని.. అన్ని వర్గాల ప్రజల కోసం ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలకు తోడు కొత్తవి ప్రకటించనున్న నేపథ్యాన మరోమారు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత స్పష్టం చేశారు. ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరగగా, ప్రతీ ఇంటికి అభివృద్ధి ఫలాలు అందాయని తెలిపారు. ఈ మేరకు ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి మూడో దఫా కూడా కేసీఆర్‌ను సీఎంగా చేయాలని కోరారు. కాగా, ఇల్లెందు నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనట్లుగా అభివృద్ధి జరిగిందని, 100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఐటీఐ మంజూరయ్యాయని చెప్పారు. కాగా, నవంబర్ 1వ తేదీన ఇల్లెందులో జరిగే సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని తెలిపారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇల్లెందులో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని తనను గెలిపించాలని కోరారు. తొలుత సీఎం కేసీఆర్ సభ ఏర్పాటుచేసే సింగరేణి మైదానాన్ని పరిశీలించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగాల రాజేందర్, గార్ల ఎంపీపీ చౌహాన్, నాయకులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, జేకే శ్రీనివాస్, మనోహర్ తివారీ, తాతా గణేశ్, వరప్రసాద్, పరుచూరి వెంకటేశ్వరరావు, శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక తదితరులు ఉన్నారు.

రామయ్య సన్నిధిలో ఎంపీ పూజలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామిని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్న ఆమె ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.